క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

విడపనకల్లు: మండల పరిధిలోని పాలికి గ్రామంలో గురు, శుక్రవారాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ప్రసాద్‌పై ఆరోపణలు అర్థరహితం

కళ్యాణదుర్గం రూరల్ : శ్రీ సత్యసాయి జిల్లా మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల కన్వీనర్, లేపాక్షి పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌పై ఆరోపణలు అర్థరహితమని ఎస్సీ, ఎస్టీ స్టూడెంట్ ఫ్రంట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శాంత కుమార్, నాయకులు సతీష్ కుమార్, దురదకుంట వన్నూరుస్వామి, సురేంద్ర, రామాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. స్కూల్ పిల్లల అడ్మిషన్ల విషయంలో ఆయన ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న దృశ్యం

కుందుర్పి: బెస్తరపల్లి గ్రామంలో రెండు నెలల క్రితం వడ్డె లక్ష్మదేవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌బీమా కింద రూ.5 లక్షలు మంజూరైంది. బుధవారం సర్పంచ్ హనుమంతరాయుడు, ఎంపీటీసీ ఓనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, రామదాసు, హనుమేషి తదితరులు రూ.5 లక్షల చెక్కును మృతురాలి కుమారుడు వడ్డె మూర్తికి అందజేశారు.

మల్బరీ పెంపకం లాభదాయకం


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుందుర్పి: మల్బరీ పెంపకం లాభదాయకమని సెరికల్చర్ ఏడీ ఉషావర్ధిని పేర్కొన్నారు. బుధవారం మహంతపురంలో మల్బరీ రైతులకు పట్టుపెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్బరీ రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో రేరింగ్ షెడ్లు, ఉచితంగా గంపలు, స్టాండ్లు, పురుగుమందులు అందిస్తోందన్నారు. మండల వ్యాప్తంగా 380 ఎకరాల్లో రైతులు మల్బరీ పంట సాగు చేశారని, సాగు మరింత పెంచాలన్నారు. వీఎస్ఏలు నవీన్‌కుమార్, అపర్ణ, స్థానిక సర్పంచ్ జగన్, మల్బరీ రైతులు పాల్గొన్నారు.

ఘర్షణలకు దిగితే చర్యలు


వేపరాలలో సూచనలిస్తున్న సీఐ లక్ష్మణ

రాయదుర్గం రూరల్: అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ లక్ష్మణ్ణ తెలిపారు. మంగళవారం రాత్రి, బుధవారం వేపరాల, కొండాపురం, కెంచానపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల పెద్దలు, ప్రజాప్రతినిధులను సమావేశపరచి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా గ్రామ పెద్దలు బాధ్యత తీసుకోవాలన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నారాసురుడికి అవకాశం ఇస్తే అధోగతే

- 'గడప గడప'లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


గ్రామదట్లలో వర్షంలో తడుస్తూనే బుక్‌లెట్లను అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: నరహంతకుడిగా పేరు గడించిన నారాసురుడు చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో అవకాశం ఇస్తే రాష్ట్రప్రజల జీవనవిధానం అధోగతి పాలవుతుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రా రెడ్డి అన్నారు. మండలంలోని రాతిబావివంక (బొందనకల్లు), గ్రామదట్ల గ్రామాల్లో ఆయన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గొని ఉపేంద్రరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భోజరాజు నాయక్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, సర్పంచ్ లక్ష్మీబాయి, వైస్ ఎంపీపీ శాంతాబాయితో కలిసి బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షంలోనే తడుస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు గతంలో వ్యవసాయ విద్యుత్ బిల్లులు తగ్గించమని కోరుతూ హైదరాబాద్‌లో నిరసన తెలియజేయడానికి వచ్చిన రైతులను పోలీసులను అడ్డు పెట్టుకుని తుపాకులతో కాల్చి చంపించాడన్నారు. ధర్నా చేయడానికి వెళ్లిన అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కించిన నీచుడన్నారు. షూటింగ్ యావతో పుష్కరాలకు వెళ్లిన భక్తులు 29 మందిని పొట్టన బెట్టుకున్నాడని ఆరోపించారు. నారాసురుడికి 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పినా బుద్ధి రాలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ పేద ప్రజల సంక్షేమం కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని విధంగా పథకాలు ప్రవేశపెట్టి, అవినీతిరహితంగా అందిస్తున్నారన్నారు. జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున, వీరశైవ లింగాయత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాఘవేంద్రగౌడ్, బోర్‌వెల్ నాగిరెడ్డి, రేకులకుంట శివారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు దిలావర్ భాష, ఉడేగోళం సొసైటీ అధ్యక్షులు భీమన్న, హరిశ్చంద్రనాయక్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు జయరాం నాయక్, శ్రీనివాస్ రెడ్డి, ధనుంజయరెడ్డి, పాటిల్ రఘునాథ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, స్వామీ నాయక్, వీరేష్, లోకనాథ్ నాయక్, రాముడు నాయక్, స్టోర్ డీలర్ జగదీష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం సందడి

రాయదుర్గంటౌన్: మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు రాయదుర్గంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. బుధవారం పీర్ల చావిడిల్లో ప్రత్యేక ఫాతెహా, చిన్న సరిగెత్తు వేడుకలను ముజావర్లు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా 29వ తేదీ పానకాల సమర్పణ, పెద్ద సరిగెత్తు, 30వ తేదీ ఆదివారం జలధి కార్యక్రమాలు జరుగుతాయి. 150 ఏళ్లకు పైబడి చరిత్ర గల ఉచ్చుబాయి, గొందిబావిలోని పెద్దపీర్లు, బళ్లారి రోడ్డులోని చమ్మా మకాన్, ఆత్మకూరు వీధిలోని నింబూసా, లడ్డు పీర్ల మకాన్ తదితర ప్రాంతాల్లోని చావిడిల్లో చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి.

విరాళం అందజేత

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల) అభివృద్ధికి నియోజకవర్గ బీసీ, ఈడిగ సంఘం అధ్యక్షుడు కేబీ అశోక్ కుమార్ గౌడ్ తనవంతుగా రూ.10 వేల విరాళం అందజేశారు. నగదును బుధవారం ప్రిన్సిపాల్ వెంకటేశులుకు అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, రాయదుర్గం మండల బీసీ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ వీరశేఖర్, మారుతి మెడికల్ స్టోర్ యజమాని ఆనంద్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో వేగం పెంచాలి


మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య

బెళుగుప్ప: ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ కలెక్టర్, మండల నోడల్ ఆఫీసర్ శంకరయ్య పేర్కొన్నారు. బుధవారం హ నిమరెడ్డిపల్లిలో జరుగుతున్న సచివాలయ భవన నిర్మాణ పనులను ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓ మల్లారెడ్డితో కలసి పరిశీలించారు. బెళుగుప్పలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. హౌసింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ తో కలసి మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలానికి కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు సుదాకర్, హర్ష, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, వైకేపీ ఏపీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

అత్యాధునికంగా పీహెచ్‌సీ

- రూ.1.73 కోట్లతో నిర్మాణం
- నెరవేరిన యర్రగుంట ప్రజల చిరకాల కోరిక
- విప్ కాపు చొరవపై స్థానికుల హర్షం


రూ.1.73 కోట్లతో కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోంది. ఇందుకు యర్రగుంట నూతన పీహెచ్‌సీ భవనమే నిదర్శనం. యర్రగుంట గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలందించేందుకు 1986లో పీహెచ్‌సీని ఏర్పాటుచేశారు. భవనం పూర్తి శిథిలావస్థకు చేరుకొంది. పై కప్పు పెచ్చులూడుతున్నాయి. కొత్త భవనం నిర్మించాల్సి ఉన్నా.. గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. విషయాన్ని గ్రామస్తులు విప్ కాపు రామచంద్రా రెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.1.73 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో కొత్త భవనం రూపుదిద్దుకొంది. పనులన్నీ చకచకగా సాగిపోయాయి. ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఓపీ, ఇన్‌పేషెంట్ గది, ల్యాబ్, ఫార్మసీ గదితో పాటు మరెన్నో గదులతో పీహెచ్‌సీ అత్యాధునికంగా తయారైంది. దీంతో యర్రగుంట గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. ప్రభుత్వ విప్ కాపు కృషిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న పనులు మరో మూడ్రోజుల్లో పూర్తవుతాయని ఆర్‌అండ్‌బీ డీఈఈ రవిశంకర్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. త్వరలో విప్ కాపు చేతుల మీదుగా కొత్త భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళలపై దాడి అమానుషం

కూడేరు: మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడి అమానుషమని ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్ అన్నారు. బుధవారం కూడేరులో ఎస్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకుని మహిళలపై దాడులు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నారాయణమ్మ, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో బియ్యం ప్రత్యేక కౌంటర్లు

రాయదుర్గంటౌన్: బియ్యం, కందిబేడలు ప్రజలకు అందుబాటు ధరల్లో లభించేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయి చర్యలు చేపట్టింది. తహసీల్దార్ మారుతితోపాటు పౌర సరఫరాలశాఖ అధికారులు బియ్యం మర్చంట్స్‌తో చర్చించి వారి సహకారంతో మూడు బియ్యం ప్రత్యేక విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేయించారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం, కందిబేడల ధరల నియంత్రణ కోసం ప్రభుత్వ ఆదేశాలతో బియ్యం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటర్లలో కేజీ సోనామసూరి రూ.48 ప్రకారం రేషన్‌కార్డుకు 10 కేజీలు, రూ.130 ప్రకారం కేజీ కంది బేడలు విక్రయించనున్నట్లు చెప్పారు. లక్ష్మీబజార్ యూనియన్ బ్యాంకు ఎదురుగా గెల్లి గోవిందప్పశెట్టి సన్స్, గ్రామీణ బ్యాంకు సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి అండ్ సన్స్‌తోపాటు ఆస్పత్రి వెనుక వైపు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సన్మార్గంలో ముందుకు సాగండి


మాట్లాడుతున్న క్యాంప్ కమాండర్ కల్నల్ సందీప్ ముంద్రా

కూడేరు: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 10 రోజుల పాటు కొనసాగిన 6 ఆంధ్ర బెటాలియన్ సీఏటీసీ-3వ విడత శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా క్యాంప్ కమాండర్ సందీప్ ముంద్రా మాట్లాడుతూ.. ఇక్కడ నేర్చుకున్న సేవా గుణాన్ని, నాయకత్వ లక్షణాలను, క్రమశిక్షణను, సత్ప్రవర్తనను సమాజంలోకి వెళ్లిన తర్వాత కూడా ఇలానే కొనసాగించాలన్నారు. సన్మార్గంలో ముందుకు సాగుతూ మంచి పేరు తెచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. వివిధ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు, సత్యసాయి, అనంతపురం, నంద్యాల జిల్లాలకు చెందిన 350 మంది క్యాడెట్లు, సుబేదార్ మేజర్ సుఖ్‌దేవ్ సింగ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పాలయ్య (72) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి

బ్రహ్మసముద్రం : మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని అధికారులు ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. భైరసముద్రం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంపీడీఓ దాసా నాయక్ , తహసీల్దార్ బాలకిషన్ , ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

గుమ్మఘట్ట: మొహర్రం పండుగ భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సునీత తెలిపారు. బుధవారం మండలంలోని కలుగోడు, గోనబావి, గుమ్మఘట్ట, మారెంపల్లి, గొల్లపల్లి, గలగల, భూపసముద్రం, నేత్రపల్లి తదితర గ్రామాలలో ఆమె పర్యటించారు. ఆయా గ్రామస్తులకు తెలియచేశారు. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని గొడవలు సృష్టిస్తే ఎంతటి వారినైనా సహించే ప్రసక్తే లేదన్నారు. బైండోవర్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు ఐకమత్యంగా ఉండి వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

బాధితులకు పరామర్శ


ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: వెంకటాంపల్లి పెద్దతండాలో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో నలుగురు మహిళలు గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సరోజమ్మ, మాధవిని బుధవారం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతపురంలో చికిత్స పొందుతున్న దేవమ్మ, సరోజ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కుమార్ రెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీపీ.వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

విడపనకల్లు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసినట్లు పాల్తూరు ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు. బుధవారం పాల్తూరు, హావళిగి రహదారిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. పాల్తూరుకు చెందిన కుమారుస్వామి మూడు కేసుల హైవార్డ్స్, విస్కీ 90 ఎంఎల్ 288 ప్యాకెట్లను ఆటోలో తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. మద్యం, ఆటోను సీజ్ చేసిన పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దేవరాజు పాల్గొన్నారు.

రోజంతా వాన


దుర్గంలో కురుస్తున్న వర్షం

రాయదుర్గం: రాయదుర్గంలో బుధవారం భారీ వర్షం కురిసింది. రోజంతా తెరిపినివ్వకుండా చిరుజల్లులు కురిశాయి. దీంతో జనజీవనం స్తంభించింది. శాంతినగర్ మీదుగా లోతట్టు ప్రాంతాలైన రామస్వామీ, కొలిమివీధిలోకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో కాలనీవాసులు అప్రమత్తమయ్యారు. డి హీరేహాళ్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం మండలాల్లోనూ వర్షం బీభత్సం సృష్టించింది. వరి నారు మడులు, టమాట, మిర్చి లాంటి పంటల్లోకి నీరు చేరాయి.అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దిశానిర్దేశం చేశారు.

వజ్రకరూరు/విడపనకల్లు: వజ్రకరూరు, విడపనకల్లు మండలాల వ్యాప్తంగా బుధవారం వర్షం జోరుగా కురిసింది. ముందస్తుగా వేసిన కంది, వేరుశనగ, ఇతరత్రా పంటలకు కళకళలాడుతున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. చిన్న చిన్న, కుంటలు వర్షపు నీటితో నిండిపోయాయి.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కూడేరు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో మన ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని సీహెచ్‌ఓ వరలక్ష్మి, సూపర్‌వైజర్లు రవీంద్ర, వెంకటలక్ష్మమ్మ అన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు హిమోగ్లోబిన్, ఇతర పరీక్షలు చేశారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చని తెలిపారు. గైనిక్ సమస్యలుంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ కరిష్మా, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత


బస్సు షెల్టర్‌ను తొలగిస్తున్న గ్రామస్తులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలో హులిగమ్మ దేవి దేవాలయం వద్ద వారపు సంతకు ఇబ్బందిగా ఉందని, ఆక్రమణలో ఉన్న బంకులను తొలగించాలని గతంలో పంచాయతీ తీర్మానం చేసింది. బుధవారం అధికారులు లేకుండానే గ్రామస్తులు అందరూ ఏకమై ఆక్రమణలో ఉన్న బంకులను తొలగించేందుకు వెళ్లారు. జేసీబీతో చిరంజీవి అభిమాన సంఘం బస్సు షెల్టర్, కావేరి, మహేష్ బంకులను తొలగించారు. మిగతా బంకులు తొలగించేందుకు యత్నించడంతో ఆయా బంకుల యజమానులు అడ్డుకున్నారు. కోర్టులో ఉన్న కేసును తామే గెలిచినట్లు తెలిపారు. అయితే, గ్రామం అవసరం కోసమే ఆక్రమణలో ఉన్న బంకులకు తొలగిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలోనే గ్రామస్తులు, బంకు యజమానుల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

ధ్రువపత్రాల పంపిణీ

బ్రహ్మసముద్రం : భైరసముద్రం గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ ప్రభావతి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, మండల కన్వీనర్ బసవరాజు, సర్పంచ ప్రేమ, ఎంపీడీఓదాసానాయక్, తహసీల్దార్ బాలకిషన్ పాల్గొన్నారు.

శెట్టూరు: లక్ష్మంపల్లి సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఫణికుమార్, ఈఓఆర్డీ రఘురామరావు, సచివాలయ కన్వీనర్ తీన్మార్ తిమ్మరాజు, సర్పంచ్ వన్నూరుస్వామి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

బెళుగుప్ప: నరసాపురం సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం అదుపుతప్పి లారీ బోల్తా పడింది. వివరాలు.. కర్ణాటకలోని చిక్‌మంగళూరు నుంచి కలప రీపర్ లోడుతో ప్రకాశం జిల్లా చీమకుర్తికి లారీ బయలుదేరింది. వేగాన్ని నియంత్రించ పోవడంతో నరసాపురం సమీపంలోని బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ సలాం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

డెంగీపై అవగాహన ర్యాలీ

వజ్రకరూరు: మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామంలో బుధవారం డెంగీ నివారణ మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, సర్పంచ్ భూమాకమలమ్మ, ఈఓఆర్డీ సదాశివ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.